



ఉద్యోగ ప్రయత్నాలన్నీ విఫలమయి రైలు ఎక్కి వెళ్ళిపోదామనుకున్న నాకు ప్రక్క ప్రయాణీకుడి పత్రికలో 'కనబడుటలేదు" అనే ప్రకటన కనబడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది అయితే ఆ ప్రకటన నన్ను గురించి మా వాళ్ళెవరూ ప్రకటించినదిగాదు. నేను యింటి దగ్గర చెప్పే వచ్చాను. కనపడకుండా పారిపోయిన ఆ కుర్రవాణ్ణి పట్టియిస్తే నూటపదహార్లు బహుమతి యిస్తామన్నారు ప్రకటనలో కుర్రవాడి వయస్సు, ఎత్తు, రంగు, పేరు మొదలైన వివరాలన్నీ యిచ్చారు కుర్రవాడు కృష్ణాజిల్లాలో ఒక గ్రామానికి చెందినవాడు ప్రకటన రెండు మూడుసార్లు చదివాను బండి యింకా బయలుదేరడానికి వ్యవధి వుంది ప్రకటన చదువుతూ వుంటే ఆ కుర్రవాణ్ణి పట్టగలననే ధీమా, బహుమతి మొత్తం నా చేతిలో పడడానికి అభ్యంతరం ఏమీ లేనట్టు కనిపించింది వెంటనే ప్రయాణం రద్దు చేసుకొని, టిక్కట్టుసొమ్ము వాపసు తీసుకొని మళ్ళీ బెజవాడ మహానగరములో ప్రవేశించాను. ప్లాటుఫారం వదిలి బయటకు వచ్చేముందు రైలు పెట్టెలన్నీ, ప్లాటుఫారమంతా ఒకసారి ఆ కుర్రవాడి కోసం గాలించాను ఫొటో దగ్గరవుంటే మంచిదని ఆ ప్రకటనపడిన పత్రిక ఒకటి కొన్నాను నేను చేయబోయే ప్రయత్నానికి పెట్టుబడి పదు నయాపైసలతో ప్రారంభమయింది


విజయవాడలో వున్న వాడలన్నీ, కాఫీ హోటళ్ళు, సినిమా హాలులు, కాలవగట్లు, బజారు చాలా ఓపికగా, పరిశీలనగా తిరిగాను నలుగురు మనుష్యులు ఎక్కడ సమావేశమైతే అక్క

డల్లా దూరి ఆ మొహాలన్నీ జాగ్రత్తగా పరిశీలించే వాణ్ణి కాఫీ హోటళ్ళలో వున్న సప్లయర్లనీ, క్లీనర్లనీ పట్టి పట్టి చూశాను కొందరు ప్రొప్రయిటర్ల దగ్గరకెళ్ళి మీహోటల్లో సుబ్బారాయు డనే యిరవై సంవత్సరాల కుర్రవా డెవడైనా పని చేస్తున్నాడా అనీ, యీ మధ్య ఎప్పుడైనా పనిచేసి మాని వేశాడా అనీ అడిగాను కొంతమంది నాసిరకం ప్రొప్రయిటర్లు నేనేదో లేబరు డిపార్టుమెంటుకి సంబంధించిన వాణ్ణనుకుని జాగ్రత్తగానే సమాధా నాలు చెప్పారు పెద్ద హోటళ్ళ యజమానులు బిల్లుల డబ్బు వసూలు చేసుకొనే సందట్లో నాకు సమాధా నమే చెప్పలేదు ఈ సుబ్బారాయుడనే కుర్రవాడు రిక్షాలు తొక్కగూడదా అనే ఆలోచన తట్టిన దగ్గర నుంచీ రిక్షాలు తొక్కే వాళ్ళను గూడా పరిశీలనగా చూడటం ప్రారంభించాను బట్టల దుకాణాల్లోను, కిరాణా కొట్ల మీద పని చేయకూడదా అనే ఆలో చన తట్టేటప్పటికి ఆ కొట్ల ముందు నిలుచుని అందులో పనిచేసే వాళ్ళంద రినీ పరీక్షగా చూడటం మొదలు బెట్టాను మొదటి రోజున కాలినడకను బెజవాడంతా యించుమించుగా తిరిగి చాలా ముఖాల్ని పరీక్షించాను మరు నాడు తిరగలేక సిటీబస్సు ఎక్కి నా వేట ప్రారంభించాను నడక పని తగ్గ గానే నా బుర్ర వేగంగా పని చేయడం ప్రారంభించింది ఈ సుబ్బారాయుడు యింట్లోంచి ఎందుకు పారిపోయాడు? పోనీ ఏదో కోపం వచ్చో, దెబ్బలాడో పారిపోయినా తను ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో, కనీసం క్షేమంగా వున్నట్లైతే యింటికి ఎందుకు ఉత్తరం వ్రాయలేదు? ఈ ఆలోచనలు వచ్చిన మరుక్షణమే వాడు యివన్నీ చేస్తే వాళ్ళ వాళ్లు పేపర్లలో ప్రకటించడం, నాకు యీ పని కలగడం జరిగి వుండేవి కాదుగదా అని అనిపించి నాలో నేనే నవ్వి వూరుకున్నాను కొంత సేపు పోయిన తర్వాత మళ్ళీ అనిపించింది ఈ పేపర్లో ప్రకటించడం, బహుమతి యిస్తాననడం చెయ్యకపోతే, వాళ్ళ వాళ్లే నలుగురూ నాలుగు మూలలకూ పోయి ఎందుకు వెతక గూడదని పించింది అయితే మరుక్షణమే వాళ్ళ వాళ్లు వెతికి విసిగి, వేసారి చివరకు ఈ పని చేశారనిపించింది అయితే యిహ యీ ప్రాంతాల్లో వెతికితే యీ ఆసామీ కనపడడనీ, ఎక్కడకో దూరంగానే పోయి వుంటాడనీ అని పించి విజయవాడనుంచి మకాం మార్చి గుంటూరుగాని, ఏలూరుగాని వెళ్ళి వెతుకుదామనిపించింది

ఈ సుబ్బారాయుడికోసం అన్వే షిస్తూ ఆలోచిస్తూవుంటే చిన్నప్పుడు మాయింట్లోవున్న ఆవు తప్పిపోతే

దాన్ని వెతకడం జ్ఞాపకానికొచ్చింది. కట్టుకర్రనున్న ఆవు తెంపుకొనిపోతే ఆ చుట్టుపక్కల రెండురోజులు వెతికి ప్రశ్న వేయించాము. ఆవు తప్పకుండా దొరుకుతుందనీ, ఊరికి ఉత్తరంగా పోయి ఎవరిచేలోనో పడితే కట్టివేశారనీ చెప్పారు. ఆ చెప్పిన దిశగా సైకిలు వేసుకువెళ్ళి అందరి పొలాల్లోనూ అడిగితే చివరికి ఉత్తరమూ, తూర్పు కాకుండా ఆ మూలను యాదవుల మకాంలో దొరికింది. అయితే మనిషి తప్పిపోవడానికీ, పశువు తప్పిపోవడానికీ, తేడావుంది. మనిషి యిల్లుదాటి వెళ్ళిపోయాక తనని వెతకడానికి వెంబడించే వాళ్ళందరినుంచీ దాక్కోవడానికీ, పారిపోవడానికీ ప్రయత్నిస్తాడు. పశువు అలా చెయ్యదు.

సుబ్బారాయుణ్ణి వెతకడంలో ఎంత పొదుపుగా వున్నా నాలుగుసార్లు కాఫీతాగడం, నాలుగుసార్లు టిఫిను తినడం, నడవలేక సిటీబస్సు ఎక్కడంతో పెట్టుబడి ఎక్కువై పోతున్నది గాని, ఆశయం ఫలించేలా కనపడ లేదు. అజ్ఞాతంగావున్న సుబ్బారాయుడు తాలూకు తండ్రి నాచేత మంచి ఉద్యోగమే చేయిస్తున్నాడనుకున్నాను. తనడబ్బు ఖర్చుకాకుండా యింటిదగ్గర కూర్చుని, తన పనులు తాను చూసుకుంటూ కొడుకుని పట్టుకోవడానికి మంచిఎత్తే ఎత్తాడనిపిం




*బయలుదేరినచోటికే ....*

చింది ఈ ఆలోచన రాగానే మరో విషయం తట్టింది అయితే తీరా వెతికి తీసుకువెళ్ళాక ప్రకటించిన బహుమతి యివ్వనంటే? మళ్ళీ నన్ను నేనే సమాధానం పరుచుకున్నాను సాధారణంగా ఎవళ్ళూ అలా అనరు ఒకవేళ అంటే అప్పుడే అతన్ని నలుగురిలోనూ పెట్టి నాలుగూ దులిపెయ్యొచ్చు ఈ ఆలోచనలతో విజయవాడ రంగం ముగించి గుంటూరువైపు వెళ్లడానికి స్టేషనుకి వెళ్ళి టిక్కట్టు కొన్నాను

అర్ధరాత్రి గుంటూరులో దిగి బ్రాడీపేటవైపు వెడుతున్నాను ఆశ్చర్యం, నాకు కావలసిన వ్యక్తి నాకు ఎదురుగా యిరవై గజాల దూరంలో నడుస్తూ నావైపే వస్తున్నాడు మెర్క్యూరీ లైటు దగ్గరకు రానిచ్చి జాగ్రత్తగా పరిశీలించాను జేబులోంచి ప్రకటన కాగితంలోని ఫోటో తీసి చూసి మళ్ళీ అతన్ని పరీక్షించాను ముమ్మూర్తులా అతనే అయితే అతన్ని ఎలా పలకరించాలో, ఏమని పలకరించాలో తెలియలేదు తీరా నేను అతని కోసమే వెతుకుతున్నానని తెలిస్తే మళ్ళీ ఏదైనా రైలుఎక్కి వుడాయిస్తాడేమో? లేక, అర్ధరాత్రి నేను దారికాసి అతన్ని బెదరిస్తున్నానని అల్లరి చేస్తాడేమో? నాకేమీ పాలుపోలేదు అయినా ధైర్యం కూడగట్టుకుని గబగబ నడిచి వెళ్ళి నన్ను దాటిపోయిన ఆ సుబ్బారాయుణ్ణి ఆపి "అగ్గిపెట్టె వుందా" అని అడిగాను అగ్గిపెట్టె మాట్లాడకుండా తీసి యిచ్చాడు అయితే ఏదో పలకరించడంకోసం అగ్గిపెట్టె అడిగాను గానీ నిజంగా నాకు అగ్గిపెట్టె అక్కర్లేదు నేను సిగరెట్టు కాల్చను. వెంటనే సిగరెట్టుకోసం అన్నట్లుగా జేబు తడుముకున్నాను అదిచూసి, "ఒహో సిగరెట్టు కూడా కావాలా" అని ఒక డక్కను సిగరెట్టు తీసి యిచ్చాడు అతని మర్యాదకు నాకు చాలా ముచ్చటవేసింది "అబ్బే నేను కాల్చనండీ నా జేబులోంచి ఒక నాణెం పడిపోయింది అది వెతుకుదామనీ" అని నసిగాను అగ్గిపుల్లగీసి పడిపోని నాణెంకోసం వెతకడం ప్రారంభించాను, నా సమయస్ఫూర్తికి నన్ను నేనే అభినందించుకుంటూ "ఆ పెట్టెలో ఆట్టే పుల్లలు లేవు, వుంచుకోండి" అని అతను చరచరా స్టేషనువైపు వెళ్ళిపోతున్నాడు ఇక యింతకంటే ఏం రుజువు కావాలి? నేను వెతుకుతున్న ఆసామి యితనే "అప్పుడే పిట్ట పారిపోవడానికి ప్రయత్నం చేస్తోంది" అని అనుకుని గబగబ వెళ్ళి చెయ్యి పట్టుకున్నాను ఒక్క-వూపుతో విదలించేశాడు "ఏం

నాచెయ్యి పట్టుకుంటావేం?'. అన్నాడు "నువ్వు నాతో రావాలి" అన్నాను "ఎందుకు, ఎక్కడికి?" అన్నాడు "ఎక్కడికో, ఎందుకో నీకదంతా ఎందుకు, నాతో రావలసిందే" "నువ్వెవరు నన్ను నీతో రమ్మనమనడానికి, నీకేం పిచ్చెక్కిందా" అని గట్టిగా అరిచాడు "నువ్వు అరిస్తే నేను భయపడను" నలుగురూ చేరితే మరీ మంచిది నిన్ను మందలించి మరీ పంపించుతారు అధిక ప్రసంగం చెయ్యక నాతోరా" అని స్టేషనువైపు రెక్క పట్టుకొని లాగాను మళ్లీ అతను విదిలించేశాడు "నువ్వు సవ్యంగా రాకపోతే, పోలీసులతో చెప్పి మరీ నిన్ను తీసుకు వెడతాను" అన్నాను పోలీసులతో చెప్పడానికి నేనేం నేరం చేశాను" అన్నాడు "నువ్వేం నేరం చేశావో ఇంటికి వచ్చిచెప్పుకో, యీ శషభిషలు నాదగ్గర కుదరవు" అన్నాను 'నన్నెవరనుకుంటున్నావు' అన్నాడు చివరకి అతను ప్రాణంవిసిగి, "నువ్వెవరో నాకు తెలుసు నువ్వు సుబ్బారాయుడివి" అన్నాను అతిఖచ్చితంగా ఈసమాధానంతో అతను తెల్లబోయాడు "అయితే నన్ను నువ్వెవరో కొత్తవాడివి నువ్వు తీసుకు వెళ్లడమెందుకు మాయింటికి, నేనే వెడు



నువ్వే రైటోయ్! రెండుచేతులా సంపాదిస్తున్నావు

తున్నాగా" అన్నాడు "నేనూ వస్తాను పద నువ్వు వెడతానంటే నేను నమ్మేవాణ్ణిగాదు" అని అతనితో కలిసి స్టేషనులోకి వెళ్ళాను అతని

టికెట్టు అతనే కొన్నాడు నా టికెట్టు నేను కొనుక్కొన్నాను ఇద్దరం బందరుబండి ఎక్కి పెడనలో దిగాం నేను దారిలో అతనితో ఏమీ మాట్లాడలేదు అసలువిషయం చెబితే పారిపోతాడేమోనని ఏమీ చెప్పలేదు ప్రయాణం చేస్తున్నంతసేపూ నాకళ్లు అతనిమీదే వున్నాయి రెండురోజులు విజయవాడంతా తిప్పించిన ఆసామి గుంటూరులో యింత సులభంగా దొరుకుతాడనుకోలేదు ఈ సుబ్బారాయుడు మూలాన్ని నేను త్వరలోనే ఒక డిటెక్టివ్‌నయి, యికముందు రోజూ యిటువంటి కేసులూ, యింత కంటె క్లిష్టమయిన కేసులూ పట్టుకొని ప్రఖ్యాతి గడించే రోజులు సుదూరంలో వున్నట్టనిపించింది

సుబ్బారాయుడే వాళ్ళ యింటికి తిన్నగా తీసుకువెళ్ళాడు వాళ్ళనాన్న వెంకట్రామయ్య కనుపించగానే ఆయనే అతని తండ్రి అయివుంటాడని వూహించి నమస్కారం చేశాను ఆయన కూర్చోమని, ఎవరండీ మీరు అని అడిగారు మాది రాజమండ్రి అనీ, వారి అబ్బాయిని ఎంతో శ్రమపడి వెతికి తీసుకు వచ్చాననీ చెప్పాను దానికి ఆయన కొంచెం ఆశ్చర్యం ప్రకటించి "మావాడు గుంటూరులో మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నాడు యింట్లోంచి పారిపోయినది మా అన్నయ్యగారి అబ్బాయి వాడూ, వీడు యించుమించు ఒకలాగే వుంటారు పాపం మీరు చాలా శ్రమపడ్డారు మావాణ్ణిచూసి పేపర్లోపడిన బొమ్మవీడిదేనని అనుకొని వుంటారు అయినా మీధర్మమా అని వాడుకూడా నిన్ననే యింటికి చేరాడు లెండి మద్రాసు అంతా తిరిగివచ్చి" అన్నాడాయన

ఈమాటలు వినేటప్పటికి గొంతు తడి ఆరిపోయింది మంచినీళ్లు అడిగి తాగాను తర్వాత చిన్నసందేహం పుట్టింది మీ పేరేమిటని ఆయన్ని అడిగాను "నా పేరు వెంకట్రామయ్యే కాని అందరూ నన్ను చిన్న వెంకట్రామయ్య అని పిలుస్తారు" అన్నాడు మరి మీ అన్నయ్యగారి పేరేమిటన్నాను "ఆయన పేరూ వెంకట్రామయ్యే" అని. నేను ఎందుకు ప్రశ్నించానో వూహించి "పత్రికలో ప్రకటన యిచ్చింది మా అన్నగారు, నేనుకాదు" అన్నాడాయన "మా అన్నగారు కూడా యీ ప్రక్కనే వుంటున్నారు వారినికూడా చూసి వెళ్లుదురుగాని రండి" అన్నాడాయన అప్పుడే నాకు దోవ చూపిస్తూ "అక్కర్లేదు లెండి వెళ్ళొస్తా" అని తిరిగి చూడకుండా వచ్చేశాను ★